కావ్యపరిచయాలు

పారిజాతాపహరణం

నందితిమ్మన

భారతీ విద్యా పీఠము
B-38
0088
కడప, Y.S.R. జిల్లా

సంపాదకుడు

శ్రీ ఎం. వి. యల్. నరసింహారావు



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-500 004.

C_1'

ASMB01C143

కావ్యపరిచయాలు

పారిజాతాపహరణం

నందితిమ్మన

శ్రీభారతీ విద్యా పీఠము
పొదిలి, Y.S.R. జిల్లా

సంపాదకులు

శ్రీ ఎం. వి. యల్. నరసింహారావు

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-500004.

ప్రథమ ముద్రణ
ప్రమాదీచ 1974
ప్రతులు 3000

వెల : 0-40

ముద్రణ :
బి. వి. ఆర్. కాలేరెడ్డి అండ్ కం.,
సికింద్రాబాదు.

తొలిపలుకు

తిక్కన యుగము నుంచి తిరుపతి వేంకట కవుల యుగము వరకు అనగా కొన్ని నూర్ల సంవత్సరాల పాటు తెలుగు సాహిత్యానికి ఒక విశిష్టతను చేకూర్చినది ప్రబంధమండలి విభాగము. తెలుగు ప్రబంధాలు కావ్య శిల్పానికి ఆటపట్టులు–పండితులకే కాక రసజ్ఞులకు కూడ యీ ప్రబంధాలలోని ముఖ్యమైన పద్యాలు కంఠస్థాలు. ప్రాచీనాంధ్ర సాహిత్యములో అనేక శతాబ్దాల పాటు ప్రధానస్థానము నాక్రమించిన యీ ప్రబంధాలను కొన్నింటిని పాఠక లోకానికి అందించవలెనని నిశ్చయించి అంధ్ర కేంద్ర ప్రభుత్వముల సహకారముతో యిప్పటి వరకు ౪౫ కావ్యాలను అకాడమి ప్రకటించినది. ప్రతి కావ్యానికి ౪౦ పేజీల పీఠికను సమర్థులైన సంపాదకులచే వ్రాయించినది. ఇట్లు ప్రచురించిన కావ్యాలు జనాదరణ పొందినవి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అనేకమైన సారస్వత కార్యక్రమాలను రూపొందించినది. ఇప్పటి వరకు రెండు నూర్లకు పైగా గ్రంథాలను ప్రకటించినది. ఇందులో పరిశోధనకు సంబంధించిన గ్రంథాలతో పాటు సాహిత్య ప్రధానమైన గ్రంథాలు గూడ ఉన్నవి. ప్రాచీన వాఙ్మయాన్ని, ఆధునిక వాఙ్మయాన్ని రెండింటిని ప్రోత్సహించుట సాహిత్య అకాడమి ఆశయము.

సాహిత్య అకాడమి ప్రకటించిన ప్రబంధాలను పరిశీలించిన విజ్ఞులు కొందరు ప్రబంధాలను కొన్నింటిని లఘు పుస్తకాల ద్వారా పరిచయము గావించుట బాగుండగలదని సూచించినారు. ఈ సూచనకు శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారి ప్రేరణ తోడైనది. తత్ఫలితముగా పారిజాతాపహరణము, మనుచరిత్ర, ఆముక్త మాల్యద, వసుచరిత్ర, పాండురంగ మాహాత్మ్యములను అయిదు లఘు పుస్తకాల ద్వారా పరిచయము చేయవలెనని అకాడమి కార్యవర్గము నిర్ణయించినది. అందరికి అందుబాటులో నుండవలెనను ఉద్దేశముతో వీని వెల కూడ స్వల్పముగా నిర్ణయించనైనది.

ఈ అయిదు పుస్తకాలను సిద్ధము చేసినవారు శ్రీ ఎం. వి. ఎల్. నరసింహారావుగారు. వారు నూజివీడు ధర్మ అప్పారావు కళాశాలలో తెలుగు ఉపన్యాసకులు. మేము కోరినదే తడవుగ యీ పుస్తకాలను సిద్ధముచేసి యిచ్చిన శ్రీ నరసింహారావుగారికి అకాడమి పక్షాన కృతజ్ఞతలు. ఇక ముందు మరికొన్ని కావ్యాలను యీ విధముగ పరిచయము చేయవలెనని అకాడమి సంకల్పము. ఆంధ్ర మహాజనుల ఆదరణ యిందుకు లభించగలదని విశ్వాసము.

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి

హైదరాబాదు
12-3-74

-2

కావ్యపరిచయం

ఆంధ్ర పంచకావ్యాలలో నంది తిమ్మన రచించిన పారిజాతాపహరణం పద సౌకుమార్యంలో, భావనాపరిమళంలో అక్షరాలా పారిజాతమే! మక్కు తిమ్మన పేరు చెప్పగానే 'జలజాతాసన వాసవాది' వంటి ముద్దులొలికే పద్యాలతోపాటు సజీవమైన స్త్రీమూర్తి సత్యభామకూడా గుర్తుకొస్తుంది. తెలుగులో వందల కావ్యాలున్నాయి. వేల పాత్రలున్నాయి. కాని పాఠకులకు పదికాలాలపాటు మనసులో మెదిలే పాత్రలు పది మించవు. ఆ పదిమందిలో మరొకరిలో కనబడని ప్రత్యేకతలతో సత్యభామ సాక్షాత్కరిస్తుంది. స్త్రీ తత్వాన్ని, మనస్తత్వాన్ని సత్యభామ పాత్రలో నిక్షేపించాడు తిమ్మన. మురిపించే సత్యభామ వ్యక్తిత్వ చిత్రణతోపాటు ముద్దులొలికే తిమ్మన పద్యాలు పారిజాతాపహరణానికి పంచ కావ్యాలలో స్థానం కల్పించాయి. తిమ్మనకొక ప్రత్యేక స్ఫూర్తినిచ్చాయి.

శ్రీకృష్ణదేవరాయల అష్టగ్గజాలలో తిమ్మన ఒకడు. జననకాలంగురించి పరిశోధకులు ఇతమిత్థంగా చెప్పలేకపోయారుకాని, తిమ్మన రాయల ఆస్థానంలో 1523 వరకు ఉన్నట్లు శాసన ప్రమాణం కనబడుతుంది. ఆ సంవత్సరం రాయలవారు గయలో వేయించిన జయశాసనం తిమ్మన రచించిందే. నంది ఘంటకవులలో ఘంట సింగయ్య తిమ్మన మేనమామ. ఆ ఘంటకవులు కృష్ణ రాయలతండ్రి నరసానాయకునికి వరాహపురాణం అంకితం ఇచ్చారు. ఆ కారణంగా రాయలవారికి, తిమ్మనకు బాల్యంనించే స్నేహం ఉండవచ్చునని పరిశోధకులు భావిస్తున్నారు. తిమ్మన తిమ్మాంబా సింగామాత్యుల కుమారుడు. తిమ్మన పారిజాతాపహరణం అంకితం ఇవ్వటానికిముందే రాయలవా రాయనకి అగ్రహారాలు, పల్లకీలు ఇచ్చి సన్మానించారు.

తిమ్మన పారిజాతాపహరణంకాక వాణీవిలాసంఅనే కావ్యంకూడా రచించినట్లు కనబడుతుంది. అప్పకవీయానికి కవిమనోరంజని అనే విమర్శ రచించిన కూచిమంచి వెంకటరాయకవి ఈ విషయం చెప్పాడు. కాని ఆ కావ్యం ప్రస్తుతం లభ్యంకాదు.

అన్ని కావ్యాలకు అవతారిక ఉండటం సహజం. కాని ఈ కావ్యానికి అవతారికలేదు. కృతిపతి అయిన కృష్ణరాయల వంశవర్ణనతోనే కావ్యం ప్రారంభ

మవుతుంది. ప్రతికవి కృతిభర్త తనను గౌరవించి, తాంబూలమిచ్చి కావ్యరచన చేసి అంకితం చెయ్యమని కోరితే రచన ప్రారంభించినట్లు అవతారికలో చెప్పుకుంటాడు. ఈ సమాచారం కావ్యారంభంలో లేకపోవడంవల్ల తిమ్మన ఈ కావ్యాన్ని రాయల కోరికపైకాక తనకుతానే ప్రారంభించి ఉండవచ్చునని భావించవచ్చు. పారిజాతాపహరణ కావ్యరచనపై కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. నిద్రపోతున్న చిన్నాదేవి కాలు కృష్ణదేవరాయలకు తగిలింది. దానితో రాయలకు కోపంవచ్చి చిన్నాదేవి మందిరానికి వెళ్లటం మానుకున్నాడు. అప్పుడు రాయలమనను మార్చి చిన్నాదేవి దుఃఖం పోగొట్టటానికి తిమ్మన ఈ కావ్యరచన చేసి ఉండవచ్చునని ఒక ఊహ. తిమ్మన చిన్నాదేవితోవచ్చిన అరణపు కవి అన్నది ఈకథకు ఆధారం. తిమ్మన అరణపుకవి కాడని నిస్సంశయంగా చెప్పుకోవచ్చు ఆ కారణాన ఈకథ కల్పితమే అని అనటానికికూడా అవకాశం ఉంది.

తిమ్మన పారిజాతాపహరణాన్ని సంస్కృత హరివంశంనించి అనువదించాడని కొందరు భావిస్తున్నారు. తిమ్మన రచనకు కన్నడంలోని 'హరికథాసారం' ఆధారమని కొందరంటున్నారు. సరిఅయిన నిర్ణయం జరిగేవరకు పారిజాతాపహరణం తిమ్మన స్వతంత్ర కావ్యంగానే భావించవచ్చు.

తిమ్మనకు ముక్కు తిమ్మన అన్నపేరు రావటానికి ఒక కథ చెబుతారు. తిమ్మన రచించిన ముక్కు పద్యం 'నానాసూన వితానవాసనల' అన్నది భట్టుమూర్తి కొనుక్కొని తన వసుచరిత్ర కెక్కించుకున్నాడన్నది ఆకథ. ఇది కేవలం కట్టుకథేనని చెప్పవచ్చు. రాయల ఆస్థానంలో ఇద్దరు మాగ్గురు తిమ్మనలుండటంవల్ల ఈయనకు ముక్కు తిమ్మన అన్నపేరు వచ్చి ప్రత్యేకంగా పిలుచుకునేవారని భావించవచ్చు.

పారిజాతాపహరణం కావ్యం చిన్నది. కథ చాలా అల్పమైనది. అయినా పాత్రచిత్రణలో, పద్యరచనలో తక్కిన కావ్యాలకంటె భిన్నంగా కనబడుతుంది. తిమ్మన కావ్యారంభంలో పురవర్ణన మొదలైనవి చెయ్యకుండా సూటిగా కథ ప్రారంభిస్తాడు. కావ్యంలో ప్రధానం, రసవంతం అయిన సత్యభామాసాంత్వనం వరకు కథ వేగంగా నడుస్తుంది. ఇక్కడవరకు జరిగే కథలోను, కథనంలోను తిమ్మన తన ముద్రవేసుకోగలిగాడు. ఆ తరువాత సత్యాకృష్ణులు గరుత్మంతునిపై దేవలోకానికి వేగంగా వెడుతున్నా, కథమాత్రం చిమనడక నడుస్తుంది.

అయినా తన ప్రత్యేక సృష్టి అయిన సత్యభామ చిత్రణమాత్రం తొలినించి తుది వరకు ప్రత్యేక లక్షణాలతో తిమ్మన ఒక పధకం ప్రకారం చేసినట్లు కనబడుతుంది. శ్రీకృష్ణుడు రుక్మిణికి పారిజాతం ఇచ్చిన క్షణానే సత్యభామకు అపళకు నాలు తోచాయట. ఆ తరువాత శ్రీకృషుడు పారిజాతవృక్షాన్ని తెచ్చి పెరటిచెట్టు చేస్తాననేవరకు సత్యభామ మానవ సహజమైన రాగద్వేషాలతో అతి సహజంగా కనబడుతుంది. వనపాలకులు పారిజాతవృక్షాన్ని తీసుకువెళ్ళటానికి అభ్యంతరం చెప్పినప్పుడు 'ఱారుకొంగు సవరిస్తూ, వీడినకొప్పు పల్మరు వెడదోపుతూ, చెందొవ చూపులు క్రేళ్లురికే' నత్యభామరూపం ఆమె ప్రత్యేకతని తెలియజేస్తుంది. నారదుడు శ్రీకృష్ణుణ్ణి దానమీయమన్నప్పుడు 'లజ్జ సమ్మదము' వెనగొన్న మనసుతో 'ప్రేమరసాలస వీక్షణంతో' కృష్ణుణ్ణిచూసి "చిత్తగించితే మునిపతి మాటలు" అనటంలో సత్యభామ దర్పం ఆమె ప్రత్యేకతని తెలియజేస్తుంది.

బ్రహ్మ మనుషుల్నెందరినైనా సృష్టించగలడు. కాని సత్యభామను తిమ్మనవంటి కవిబ్రహ్మమాత్రమే సృష్టించగలడు.

కథాసంగ్రహం

శ్రీ కృష్ణుడు నరకాసురుణ్ణి జయించాడు. ఆతని యింటగల పదహారు వేలమంది అప్సరసలను వివాహ మాడాడు. వారితోను, ఎనిమిదిమంది పట్టపు రాణులతోను సుఖ సంతోషాలతో ఓలలాడుతున్నాడు. ద్వారకానగరంలో తోటలలో, ఏటి ఒడ్డున పొదరిళ్లలో, మణిమందిరాలలో ఏ కార్య ఏసరస కోరుకుంటే ఆ వేళ, ఆ తీరున మాయా కల్పనాచాతురితో కృషుడు వినోదించే వాడు. రుక్మిణి, సత్యభామ మాత్రం కులంలో, రూపంలో, మగని కూరిమిలో ఎవరికివారు తానే గొప్పదానినని భావిస్తుండేవారు. ఆ కారణాన వారి మధ్య రవరవలు కలిగాయి.

ఒకనాడు కృష్ణుడు రుక్మిణి మందిరంలో చంద్రకాంత శిలా వేదిక మీద కూచుని జూదంతో వినోదించసాగాడు. ఆ సమయంలో అక్కడికి నారదుడు వచ్చాడు. అతిథి సత్కారాలు పొందాడు. తరువాత శ్రీ కృష్ణుణ్ణి స్తుతించి తాను నందనవనంనించి తెచ్చిన పారిజాతనుమాన్ని మిన్నేటి పసిడి నెత్తమ్మి చిగురుటాకులో పెట్టి యిచ్చాడు. శ్రీ కృష్ణుడు ఆ కుసుమాన్ని ఎవరికివ్వటమా అని ఆలోచనలోపడి రుక్మిణి సదనంలో ఉన్నాను కదా అని ఆమెకే యిచ్చాడు.

ఆమె తీసుకుని నారదునికి మొక్కి సిగలో ధరించింది. పారిజాతసుమం ధరించగానే ఆమె అందం ఇనుమడించింది. నారదుడు పారిజాత సుమ మహిమల్ని వర్ణించాడు. ఆ సుమాన్ని శచి, పార్వతి, లక్ష్మి, సరస్వతి తప్ప మరెవ్వరూ ధరించలేదు. కృష్ణుని ప్రీతికి పాత్రమయినదానవు కనక నీవు ధరించ గలిగావు. ఈ పుష్పం పరిమళం చెడదు, వాడదు. నిరంతరం ఆనందాన్ని కలిగిస్తుంది అన్నాడు నారదుడు. నారదుడు అంతటితో ఆగలేదు. హరికి ఇన్నాళ్లు సత్యభామ అంటేనే మక్కువ అని విన్నాం. కాని ఈనాడు అది అబద్ధమని తేలిపోయింది. నేటితో సత్యభామ గర్వం తగ్గుతుంది అని కూడా అన్నాడు.

సత్యభామ తన శృంగార వనంలో పూల తేనెల ఏటి కాలువ ఒడ్డున చెంగల్వ పుప్పొళ్లు పరచిన చంద్ర కాంత శిలావేదిక మీద చెలికత్తెతో సరస గోష్ఠిలో ఉండగా అపశకునాలు కనబడ్డాయి. నాథుడు మరొక చెలితో కలిసి తనను అవమానించాడేమో అనుకొంది. అంతలో చెలికత్తె వచ్చి రుక్మిణీమందిరంలో జరిగిన వృత్తాంతాన్ని పూసగుచ్చినట్లు చెప్పింది. ఆ మాటలువిన్న సత్యభామ వేటుపడ్డ ఉరగాంగనలాగా, నేయి పోస్తే భగ్గని ఎగసిన భయంకరమైన అగ్ని జ్వాలలాగా లేచింది. గోపాలుణ్ణి ధూర్తుడుగా భావించింది. ఆయన తన కిష్టమైన వారికి పారిజాతాన్ని యిచ్చుకోవచ్చు కాని తన ప్రసక్తి అక్కడ రావలసిన అవసరం లేదని భావించింది. తప్పంతా కృష్ణునిదే అని నిశ్చయించుకొంది. పచ్చని చందనవృక్షం తొర్రలోకి పోయే ఆడపాములాగా కోపగృహానికి వెళ్లింది. అంతటి కోపంలోను అమెకు ప్రణయ తాపం కలిగింది.

సత్యభామకు పారిజాతవృత్తాంతం తెలిస్తే ఏం జరిగేదీ ఊహించి శ్రీకృష్ణుడు సత్యభామ సదనానికి వచ్చాడు. కోపగృహంలో ఉందని తెలిసి హుటాహుటిగా వెళ్లాడు. దారిలో కనబడిన చెలికత్తెలను మంతనాలాడి, మంచి చేసుకొని, బెదిరించి అవతలకు పంపించి వేశాడు. తానే వీవన తీసుకొని విసరడం మొదలు పెట్టాడు. ఆ పిల్లగాలిలో పారిజాత పరిమళం సోకి సత్యకోపం పెచ్చు పెరిగింది. శ్రీ కృష్ణుడు అనునయించబోయాడు. ఆమె తన చేతిలోని తలారవిందంతో కొట్టబోయింది. శ్రీకృష్ణుడు మన్నించమని పాదాల చెంత చేరాడు. అమె వామపాదం కృష్ణుని శిరసుకు తగిలింది. ఆ తాకిడివల్ల ఆమె పాదం కందిపోయిందేమోనని కృష్ణుడు బాధపడ్డాడు. తనకు జరిగిన అవమానం కన్నా. తాను చేసిన అపరాధం సత్య మనసును కలచివేసింది. అయినా బెట్టు వదల

కుండా కృష్ణుణ్ణి అనవలసిన నాలుగు మాటలూ అనేసింది. పసుల కాపరికి భావజమర్మకర్మాలు తెలియవంది. కోపం, తాపం కలిసి కన్నీరుగా కరిగి దుఃఖించ సాగింది. శ్రీకృష్ణుడు ఆమెను కౌగిట చేర్చి బుజ్జగించాడు. ఇంద్రుడు యుద్ధానికి వచ్చినాసరే పారిజాతవృక్షాన్ని తీసుకు వచ్చి సత్య వెరటిచెట్టు చేస్తానని ప్రతిజ్ఞచేశాడు. సత్యభామ మనసు చల్లబడింది. శ్రీకృష్ణుని సరసాలలో కరిగిపోయింది.

ద్వితీయాశ్వాసం

నారదుడొకనాడు సత్యాసదనానకి వచ్చాడు. సపర్యలు చేసిన సత్యభామను "భర్త నికోర్కెలు తప్పక తీరుస్తాడని" ఆశీర్వదించాడు. అదితి కుండలాలు తిరిగి యివ్వటానికి తాను దేవలోకం వస్తున్నవార్త ఇంద్రునికి చెప్పమని శ్రీకృష్ణుడు నారదునికి చెప్పాడు.

శ్రీ కృష్ణుడు నిండు కొలువులో ఉండి గరుడుణ్ణి తలుచుకున్నాడు. తాను దేవలోకానికి వెళ్ళి పారిజాత వృక్షాన్ని తీసుకువస్తానన్న ప్రతిజ్ఞ గరుడునికి తెలియజేశాడు. పూర్వం ఇంద్రునితో తనకు గల వైరం తీరే సమయం వచ్చిందని గరుడుడు సంతోషించాడు. శ్రీకృష్ణుడు సత్యాసమేతుడై గరుత్మంతుని అధిరోహించి దేవలోకం బయలు దేరాడు. దోవలో కనబడిన మేరుపర్వతం గురించి, అక్కడగల గంధర్వాదుల గురించి సత్యకు చెప్పాడు.

తృతీయాశ్వాసం

ఇంద్రుడు దిక్పాలకులతో కలిసి శ్రీకృష్ణుణ్ణి ఆహ్వానించాడు. కృష్ణుడు అదితిని దర్శించి కుండలాలు సమర్పించాడు. ఇంద్రుడు సత్యా కృష్ణులకు వైజయంతిని విడిదిగా ఇచ్చాడు. శ్రీ కృష్ణుడు సత్యభామతోకలిసి నందన వన విహారంచేస్తూ అక్కడగల లతావృక్షాల విశేషాలను సత్యభామకు వర్ణించి చెప్పాడు. అక్కడ కనబడిన పారిజాత వృక్షాన్ని వెంటనే తీసుకుని పోవాలని సత్యభామ తొందర పడింది. శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. మధ్యాహ్న సమయాన ఆకాశగంగలో జలక్రీడలు చేశారు.

చతుర్థాశ్వాసం

శ్రీకృష్ణుడు పారిజాత వృక్షాన్ని పెకలించే సంకల్పంతో నందన వనానికి వెళ్లాడు. వృక్షాన్ని గరుడుని మూపుమీద పెట్టగానే అక్కడున్న వనపాల

కులు ఇది ధర్మంకాదని వలికారు. క్షీరసముద్రంలో వుట్టిన కౌస్తుభాన్ని, శ్రీదేవిని ఎవరు చేపట్టారో వారే ఈ పారిజాతానికికూడా అర్హులవుతారు కాని అది ఉద్యానవనంలో నాటించుకొనటానికి ఇంద్రాణి ఎవరు? ఇంద్రు డెవరని సత్యభామ ప్రశ్నించింది. శచీదేవి వీరపత్ని అయితే ఇంద్రుణ్ణి పంపి పారిజాతాన్ని మరల పరిగ్రహించ వచ్చుననికూడా తెలియజేసింది.

దేవేంద్రుడు శచీదేవితో కలిసివున్న సమయంలో వనపాలకులు ఈవార్త చెప్పారు. దేవేంద్రుడు కోపగించాడు. సత్యభామ గర్వం అణచాలనుకున్నాడు. దిక్పాలకులకీ విషయం తెలియజేసి యుద్ధరంగం సిద్ధంచేశాడు. దేవతలందరూ తమ గణాల్ని సమకూర్చుకుని యుద్ధానికి బయలుదేరారు

పంచమాశ్వాసం

దేవలోకం యుద్ధనాదాలతో దద్దరిల్లిపోయింది. సురవీరులు శ్రీకృష్ణుణ్ణి ఎదుర్కొన్నారు. కృష్ణుడు తననెదుర్కొన్నవారిమీద బాణవృష్టి కురిపించాడు. దిక్పాలకులు, ఇతర దేవగణం శ్రీకృష్ణుని పరాక్రమం ముందు నిలవలేక పోయారు. దేవేంద్రుడు యుద్ధరంగానికి వచ్చి కృష్ణునితో యుద్ధం ప్రారంభించాడు. ఇంద్రుడు ప్రయోగించిన అగ్నేయాస్త్రం కృష్ణుని తేజస్సులో కలిసిపోయింది. వాయవ్యాస్త్రం కృష్ణుని నిట్టూర్పులో సురిగిపోయింది. సూర్యాస్త్రం కృష్ణుని కనుచూపులో అణగారి పోయింది. పాశుపతాస్త్రం శరీరంలో కలిసిపోయింది. తన సమస్తాస్త్రాలు వ్యర్థమయేసరికి ఇంద్రుడు క్రుద్ధుడయాడు. వజ్రాయుధం ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు వజ్రాయుధాన్ని హేలగా పట్టుకున్నాడు. దానితో సురగరుడ గంధర్వ కిన్నర వీరులంతా ఢక్కాలు పట్టుకుని చెల్లాచెదరైపోయారు. దేవేంద్రునికి కృష్ణుని మహత్వం తెలిసి వచ్చింది. అపరాధం అంగీకరించాడు. పారిజాతమే కాదు సమస్తమూ శ్రీకృష్ణుని సొమ్ముగా తెలియజేశాడు.

శ్రీకృష్ణుడు సత్యానమేతుడై పారిజాత వృక్షంతో సహా భూలోకానికి తిరిగి వచ్చాడు. ఆ పారిజాతం ప్రభావం వల్ల ద్వారకలో వృద్ధులంతా పునర్యౌవనాన్ని పొందారు. వేదవారు సర్వసంపదలతో తులతూగారు. సత్యభామ, కోరిన కోరికలన్నీ ప్రసాదించే ఈ పారిజాతాన్ని పెరటిచెట్టు చేసుకుంది.

సత్యాకృష్ణులు ఒకరినొకరు వీడక సర్వ సౌఖ్యాలు అనుభవిస్తుండగా ఒకనాడు నారదుడు వచ్చాడు. సత్యభామ సౌభాగ్యాతిశయాన్ని ప్రశంసించాడు. పుణ్యక వ్రతాన్ని ఆచరించినట్లయితే ధన కనక సమృద్ధి లభిస్తుందనీ, భర్తతో కలిసి ఇష్టకామ్యాలను పొందవచ్చుననీ చెప్పాడు. పదిపేలమంది పేరంటాండ్రను పిలిచి వారికి అర్చనలుచేసి, నెలరోజుల వ్రతాచరణ తరువాత శుభ లక్షణ లక్షితుడై మహానుభావుడైన బ్రాహ్మణునికి వస్తు వాహనాలతో, పారిజాతంతో భర్తను ధారపోయ్యాలనీ ఆ తరువాత అతడు కోరిన ధనాన్నిచ్చి భర్తను పరిగ్రహించవచ్చుననీ ఉద్యాపన చెప్పాడు. సత్యభామ వ్రతాచరణకు శ్రీకృష్ణుడు అంగీకరించాడు. విశ్వకర్మచేత రైవతకాద్రి సమీపంలో దాన మంటపాన్ని నిర్మింపజేశాడు. దానగ్రహణం చెయ్యటానికి నారదుణ్ణి అంగీకరింపజేశాడు. ధౌమ్యుడు మొదలయిన మహర్షులు ఆ వ్రతానికి ఋత్విజులయ్యారు.

వ్రతాచరణ పూర్తిఅయిన తరువాత శ్రీకృష్ణుడు సత్యభామా సహితంగా దానమంటపానికి వచ్చాడు. దానమిచ్చేముందు కృష్ణుని అంగీకారం తెలుసుకోవాలని నారదుడన్నాడు. సత్యభామ భర్తను చూస్తూ "మునిపతి మాట విన్నారా" అంది. శ్రీకృష్ణుడు తన అంగీకారాన్ని తెలియజేశాడు. గర్గ మహర్షి సంకల్పం చెబుతుండగా సత్యభామ వస్తు వాహనాలతోను, పారిజాతంతోను కృష్ణుణ్ణి నారదునికి దానమిచ్చింది. తరువాత తన ఆభరణాదులను నారదునకిచ్చి భర్తను పరిగ్రహించింది.

నారదుడు శ్రీకృష్ణుణ్ణి స్తుతించి దేవలోకానికి వెళ్ళాడు. వ్రతదర్శనానికి వచ్చినవారి నందరిని సత్కరించి వారిని శ్రీకృష్ణుడు వీడ్కొలిపాడు. శ్రీకృష్ణుడు రసానంద జీవితాన్ని గడపసాగాడు.

అణిముత్యాలు

కృతికర్త ఆయిన నందితిమ్మన శ్రీ కృష్ణదేవరాయలకు సదాశివుడు ఐశ్వర్యాలు ప్రసాదించాలని ప్రార్థించాడు.

మ. పొలఁతుల్ కౌఁగిటఁ గ్రుచ్చి యెత్తి తలఁ బ్రాలోయించు నవ్వేళ నౌఁ
దల గంగం దన నీడఁ దాన కని మౌగ్ధ్యం బొప్ప వేఱొక్క తొ

య్యలి యంచున్మదినెఁచు పార్వతి యసూయావాప్తికి న్నవ్వు క్రొ
న్నెలపూదాలుపు కృష్ణరాయనికి సంధించు న్మహైశ్వర్యముల్ (1-2)

కృతిపతి అయిన కృష్ణరాయలు చంద్రవంశం వాడవటం వల్ల చంద్రుడు రాయలను కరుణారసము చల్లు చూపులతో చూడాలని ఆశీర్వదించాడు.

చ. వలిమలయల్లు వాఁడు తలవాఁక ధరించిన పూవుగుత్తి, వే
ల్పులగమి జీవగట్ట, యుడివోవని చల్వలపెంకి, వెన్నెల
ల్మొలచిన పాదు, పాల్కడలి ముద్దులపట్టి నృసింహ కృష్ణ రా
యలఁ గరుణారసంబు నినుపారెడి చూపులఁజూచుఁగావుతన్ (1-6)

కృష్ణరాయని పరాక్రమాన్ని ప్రశసించాడు.

సీ. బాహు సౌధ క్రీడఁ బరఁగు పంట వలంతి
తొయ్యలి నిడుద కస్తూరి బొట్టు
వైరి సైన్యాబ్ధిలో వచ్చు గెల్పుల నావఁ
గడఁ జేర్చు ప్రాఁకుడుఁ గడపుఁజేయి
యరి కుంభి కుంభ ముక్తాక్షరాంకితమగు
జయ రమా కన్యక చదువు పలక,
శత్రురాజులకు నచ్చరల నాకర్షించు
సమరేంద్రజాల వించంపుఁ గుంచె

తే. మేను సగము యశోమహేశానునకును
శౌర్యరవిఁగోరి వచ్చిన చాయ లేమ
నరసవిభు కృష్ణరాయ భూనాథచంద్రు
చేత ననిలోన మించు కౌక్షేయకంబు (1-24)

శ్రీకృష్ణుడు పదారువేలమంది అచ్చరలేమలతో, ఎనిమిదిమంది పట్టపు రాణులతో సౌఖ్యాబ్ధిలో ఓలలాడుతున్నాడు.

శా. ఏయే వేళల నే సరోజముఖి యేయే లీలలంగోరుఁ దా
నాయావేళల నా సరోజముఖి నాయా లీలలందేల్చి, యే
చాయంజూచినఁ దానయై మెలగుచున్ సౌఖ్యాబ్ధి నోలాడుభో
గాయత్తుండయి వెక్కు రూపముల మాయా కల్పనాచాతురిన్ (1-40)

రుక్మిణి, సత్యభామ కులంలోను, రూపంలోను, మగనికూరిమిలోను ఎవరికివారు తానే ఎక్కువ అని భావించేవారు.

చ. కులమును రూపము న్మగని కూరిమియుంగలదాన నంచు నీ
వల నల రుక్మిణీ రమణి వానిఁ బెనంగఁగ, సత్యభామయుం
గులమును రూపము న్మగని కూరిమియుం గలదాన నంచునా
వలఁబచరింపఁగా, రవరవల్వాడమె న్మది వారి కెంతయున్ (1-42)

నారదుడు తీసుకువచ్చిన దివ్య పారిజాత సుమాన్ని శ్రీకృష్ణుడు రుక్మిణికే ఇచ్చాడు.

చ. కనుగవఁబిన్ననవ్వుదొలక, న్మునినాథుని కన్ననన్న ని
చ్చినఁ దగ భోజనందనయుఁ జేకొని మౌనికి మ్రొక్కి యవ్విరిం
దన నెటికొప్పునం జెరివిన న్వలిగుబ్బలి ముద్దుపట్టి లేఁ
త నెల ధరించినట్లమరెఁదద్దయు మోహన కాంతిసంపన్. (1-55)

నారదుడు పారిజాత కుసుమం ప్రత్యేకతల్ని వివరించాడు.

మ. అలి నీలాలక! నీవు నీపతి రహస్య క్రీడ వర్తించు వే
ళ లతాంతాయుధ సంగరంబునకు నుల్లాసంబు గల్పించు ను
జ్జ్వల దీపాంకురమై, రతిశ్రమ తనూ సంజాత ధారాళ ఘ
ర్మలవంబు ద్రొలగింపఁగా సురటియై రంజిల్లు నిచ్ఛాగతిన్. (1-60)

చ. కువలయ పత్రనేత్ర! నెటి కొప్పున నీకుసుమంబు దాల్చుటన్
సవతులు వచ్చి నీ చరణ సారస యుగ్మము నాశ్రయింపఁగా,
ధవుఁ డలలేని కూర్మి జవదాటక నీ పలు కాదరింపఁ గా,
నవిరళ భోగ భాగ్య మహిమాన్వితవై విహరింతు గావుతన్. (1-62)

సత్యభామ గర్వభంజనం జరిగిందని నారదుడు చెప్పాడు.

ఉ. చక్కనిదాన నఁచు, నెల జవ్వనినంచు, జగంబులోనఁ బే
రెక్కిన దాననంచు, బతి యెంతయు నాకనురక్తుఁడంచుఁ, దా
నిక్కుచు విట్టివీఁగుచు గణింపదు కాంతల సత్య, యింతకున్
గ్రుక్కక యున్నె! నీ మహిమ సూచిన బోటులు విన్నవించినన్. (1-66)

సత్యభామ చెలికత్తె రుక్మిణీసదనంలో జరిగిన వృత్తాంతాన్ని సత్యభామకు పూస గుచ్చినట్లు చెప్పింది.

ఉ. ఎంతకు లేఁడు నారదమునీంద్రుఁడు, శౌరి వినంగ, రుక్మిణీ
కాంత వినంగ, నేను వినఁగాఁ బలికెం "బతిఁ గూర్చుదాన నా
యంతటి వారు లేరని యహంకృతి నెప్పుడు విట్టి వీఁగుచున్
వంతున వచ్చు సత్య గరువం బిఁకఁజెల్ల"దటంచు మానినీ. (1-80)

చెలికత్తె చెప్పింది వినేసరికి సత్యభామకు అగ్రహం కలిగింది.

చ. అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె, నేయివోయ భ
గన దరికొన్న భీషణ హుతాశనకీల యనంగ లేచి, హే
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కులఁ గుంకుమ పత్రభంగ సం
జనిత నవీన కాంతి వెదచల్లఁగ గద్గద భిన్న కంఠియై. (1-82)

నారదుడు రుక్మిణీ మందిరంలో తన ప్రసక్తి ఎందుకు తీసుకు రావాలను కొంది సత్యభామ.

చ. అతుల మహానుభావమని యవ్విఁ దానొక పెద్దచేసి య
చ్యుతునకు నిచ్చకం బొదవ సూడిద యిచ్చిన నిచ్చెఁగాక, తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణ సేసినఁ జేనెఁగాక, యా
మతకరి వేలుపుం దపసి మమ్మఁదలంపఁగ నేల యచ్చటన్. (1-84)

పురుషుల మనసులు తేలికగా చెదిరే మబ్బుల వంటివని సత్యభామ భావించింది.

క. పరికింపరు తమ జాడలు
తరుణులు తగులములు నమ్మఁ దగదండ్రు మదిన్
శరదంబుద చలచిత్తులు
పురుషులెపో; వారినమ్మఁ బోలునెఁ చెలియా. (1-87)

క. ధన మిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగ వచ్చు మగఁ డింతులకున్
జన విచ్చి పుచ్చుకొన్నను
మన వచ్చునెఁ యింక నేటి మాటలు చెలియాఁ (1-97)

సత్యభామ ఆలంకరణలు విసర్జించి కోపగృహానికి వెళ్ళింది. ఉపరాని తాపంతో పాటు ఓపలేని కోపం తోడయింది.

ఉ. మాసినచీర కట్టుకొని, మౌనముతోడ, నిరస్తభూషయై
వాసెనకట్టు కట్టి, నిడు వాలిక కస్తూరి పట్టువెట్టి, లో
గాసిలి, చీఁకటింట కడఁ గంకటపై జలదాంత చంద్రరే
ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాదవేదనన్. (1-99)

చ. బిసరుహ పత్రలోచనకుఁ బెల్లగు మోహము సంఘటిల్లె, వె
క్కసమగు నెవ్వగల్వాడమెఁ గంపము పుట్టిఁ జెమర్చెమేను, మా
నసమున విన్నఁ బాటొదవె, నాటెఁగతుం బరితాపవేదనల్
మసకపుఁ బాము కాటు గతి మచ్చర మ న్వినమగ్గలింపగన్. (1-100)

చ. వెడనెడ కన్నుమూయుఁ, గసువిచ్చు, నగుం, దలయూఁచుఁ బాన్పుపైఁ
బడు, నుసురంచు లేచుఁ దడఁబాటును దత్తఱముం జలంబు లో
నడరఁగఁ గోపవేగమున నగ్గలమైన మనోజు బాధలం
బడి మదహస్తి హస్తగత పద్మినియుంబలె సొంపు వెంపఱన్. (1-101)

శ్రీకృష్ణుడు సత్యభామఉన్న కోపగృహానికి వచ్చాడు. అక్కడఉన్న చెలికత్తెలను పంపించి ఏకాంతాన్ని సమకూర్చుకున్నాడు.

ఉ. కొండఱి మంతనంబులను, గొంచఱి జుంకెన వాఁడిచూపులం
గొందఱిఁ జేతి సన్నలఁ దగుల్పడఁజేయుచుఁ జేరబోయి మ
ధ్యందిన భానుమండల కరావళిచే వసి వాడియున్న తీఁ
గం దలఁపించు నమ్మగువఁగన్గొని యెంతయు విస్మితాత్ముఁడై. (1-108)

శ్రీకృష్ణుడు సత్యభామను అనునయించటానికి వీవన తీసుకొని వీచ సాగాడు.

ఉ. అంతటఁ బారిజాత కుసుమాగత నూతన దివ్య వాననల్
వింతలు సేయఁ దావి యిది విస్మయమంచు ముసుంగుఁద్రోచి యే
కాంత గృహంబు నల్గడలు నారసి సంభృత తాలవృంతునిం
గాంతునిఁజూచి బాష్ప కణికా తరళీకృత లోచనాంతయై. (1-110)

శ్రీకృష్ణుడు సాంత్వన వాక్యాలు పలికాడు.

చ. మన మరయం దలంచి యొక మార్గము పన్నితొ! నవ్వులాటకో
నను వెఱపించెదో; యకట! నాయెడ నిక్క-పుఁ దప్పు గల్గెనో
వనజ దళాయతాక్షి! పగవాడనె, నన్నిటు లేలచూడ? వొ
క్క- నిముసమైన నీవు దయఁ గన్గొనకుండిన నిల్వనేర్తునే. (1-116)

మాటలవల్ల ప్రయోజనం కనబడకపోయేసరికి ఆ జగన్నాటక సూత్ర ధారి సత్య పాదాలకు మొక్కాడు.

ఉ. పాటలగంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబు మాన్ప నె
ప్పాటునఁబాటు గామి మృదుపల్లవ కోమల తత్పదద్వయీ
పాటల కాంతి మౌళి మణిపం క్తికి వన్నియ వెట్ట నా జగ
న్నాటక సూత్రధారి యదునందనుఁ డర్మిలి మ్రొక్కె- మ్రొక్కినన్ (1-120)

అప్పుడు సత్యభామ వామపాదం శ్రీకృష్ణుని శిరస్సుకి తగిలింది.

మ. జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునం
దొలఁగం ద్రోచె లతాంగి; యట్లయగు నాథుల్నేరములేఁయఁ బే
రలుకం జెందిన కాంత లెందు నుచితవ్యాపారముల్నేర్తురే?. (1-121)

సత్యభామ కాలితాకిడికి శరీరం గగుర్పొడచిన శ్రీకృష్ణుడు మరింత ప్రేమగా పలికాడు.

చ. నను భవదీయ దాసుని మనంబున నెయ్యపుఁగిన్క-ఁబూని తాఁ
చిన యది నాకు మన్ననయ; చెల్వగు నీ పద పల్లవంబు మ
త్తను పులకాగ్ర కంటక వితానము దాఁకిన నొచ్చునంచు నే
ననియెద; నల్క- మానవుగదా! యిఁకనైన నరాళకుంతలా. (1-123)

శ్రీకృష్ణుని మాటలు. చేతలు సత్యభామ కోపాన్ని మరింత పెంచాయి. కోపంతో వివశ అయింది.

ఉ. ఈ నయగారపుం బ్రియము లీపస లీ మొగమెచ్చుమాట లే
లా! నిను నమ్మి యుండిన ఫలంబిదె తోడన కల్గెనాకు, నీ

యాన సుమీ: ననుం జెనకి యూరడి వెట్టిన, నవ్వు వారలం
గాన, వెరుంగునే పసుల కాపరి భావజ మర్మ కర్మముల్. (1-125)

ఉ. ఇంకిటు నిన్ను నమ్మ, నను నేమిటికిం గెరలించె, దెంతయుం
బొంకము గాని యీ వలని బొంకులు మా చవి గావు, రుక్మిణీ
పంకజ పత్ర లోచనకుఁ బ్రాణ పదంబులు గాని, వల్లవీ
కింకర! చాలుఁ జాలు నుడికింపకు, నింపకు లేని కూరుముల్. (1-127)

ఉ. గట్టివ చేఁతలం బసలుఁ గల్లదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన; వెందులేని పలుపోకల మాయలు నీకు వెన్నతోఁ
బెట్టిన వౌ బెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మినా
గుటును దేజము న్మిగులఁ గోల్పడిపోయితి నేమిసేయుదున్. (1-127)

సత్యభామకి ఆ వివశత్వంలో శోకం పొంగి వచ్చింది.

ఉ. ఈసునఁ బుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి వంకజ
శ్రీసఖమైన మోము పయిఁ జేల చెఱంగిడి బాల పల్లవ
గ్రాస కషాయ కంఠ కలకంఠ వధూ కల కాకలీ ధ్వనిన్. (1-133)

సత్యభామను కౌగిటజేర్చి శ్రీకృష్ణుడు ఋజ్జగింపు మాటలు చెప్పాడు.

ఉ. ఓ లలితేంద్ర నీల శకలోపమ కైశిక: యింత వంత నీ
కేల లతాంత మాత్రమున కేఁ గలుగ, న్వీను; నీకు, దేవతా
కేళి వనంబు సొచ్చి, యనికి న్బలసూదనుఁ డెత్తి వచ్చినన్
దీలు పడంగఁ దోలి యటఁ దెచ్చెద నిచ్చెదఁ బారిజాతమున్. (1-135)

సత్యభామ అలకమాని అందంగా అలంకరించుకొని కృష్ణుని చేర వచ్చింది.

సీ. మాత్సర్య ఘన మేఘ మాలి కాపగమ ప్ర
కాశిత హిమధామ కళయనంగ,
విరహ నిశిథినీ విరమ నంప్రాపితో
న్మీల నామోద పద్మిని యనంగఁ

గ్రోధ దంతావళ క్షోభ విభ్రమ వున
స్సంజాత నైర్మల్య సరసి యనఁగ
సంతాప నైదాఘ సమయ నిర్గమ కోర
కిత నవ మాలతీ లతిక యనగ,

తే. శాంతిఁ జెన్నారి వికసిత స్వాంత యగుచుఁ
గలఁక యెంతయు దిగఁ ద్రోచి చెలువమెసఁగఁ
జేరవచ్చిన ప్రియభామ గారవించి
యున్నయత్తఱి మురవైరి సన్నిధికిని. (2-15)

సత్యాకృష్ణులు సుఖాలలో ఓలలాడుతుండగా ఒకనాడు నారదుడు వచ్చాడు. సత్యభామను ఆశీర్వదించాడు.

మ. అని కైనం బతి నిన్నుఁ బాసిచనునో? ప్రాణంబు ప్రాణంబుగా
నిను మన్నింపడొ? నీ మనోరథముల న్నెయ్యంబుతోఁ జేయడో?
చనవు ల్నీవలె నెవ్వరేగనిరొ? నీ సౌభాగ్య మింతంతయే?
నినుఁ బోలం గలరబ్జ గంధులనవించే, యెందు సాత్రాజితీ?. (2-25)

అదితికి కుండలాలివ్వటానికి దేవలోకానికి రాబోతున్నా నన్న వార్త దేవేంద్రునికి చెప్పవలసిందిగా కృష్ణుడు నారదుణ్ణి కోరాడు. అవ్వుడు సాయం కాలమైంది.

ఉ. ఆయత తేజము ల్దటఁగి యంబుజ బాంధవుఁ డస్తసీమకుం
బోయునిఁ జూచి వేచిన తమోనిభుఁ డంప దినాంతయోధుఁడీ
చాయఁ దదీయపత్నిఁ బెఱచంబడ సీడిచి కొంచుఁ బోయెడుం
గోయనుమాడ్కి నింతట శకుంతరవంబు సెలంగె నెల్లెడన్. (2-30)

అంధకార వర్ణన.

చ. మొనసిన దీపికా నికరముల్ గృహకార్య గతాధిసారికా
వనితల యూర్పు గాడ్పుల నెవంబునఁ గంపము నొంద నోడకుం
డని తిమిరంబు తా నభయహస్త మొసంగె ననంగ వానిపైఁ
గనుఁ గొనఁ బొల్చె నంకురిత కజ్జలవన్నవ ధూమమాలికల్ (2-36)

చంద్రోదయ వర్ణన.

చ. అమరుల బోనపుట్టిక, సహస్రమయూఖుని జోడుకోడె, సం
తమసము వేరువిత్తు, కుముదంబుల చక్కిలిగింత, పుంశ్చలీ
సమితికిఁ జుక్కవాలు, నవ సారసలక్ష్మి తొలంగుబావ, కో
కమలకు గుండెతల్లడము, కైరవమిత్రుఁడు తోఁచెఁదూర్పునన్. (2-41)

చ. వలిపము కట్టి, హారములు వైచి, పటీరము మైనలంది, జా
దులు నెటి గొప్పనం దుటిమి, త్రోవనె పోయితిమేని తాఁకియుం
దలఁచెడువారు లేరని మనంబు కలంకలు దీర్చి జారకాం
తలసమయ స్థలంబులకుఁ దార్చిరి దూతిక లట్టు వెన్నెలల్. (2-52)

దేవలోకానికి వచ్చిన శ్రీకృష్ణుణ్ణి దేవేంద్రుడు సగౌరవంగా ఆహ్వానించాడు.

ఉ. ఆ దనుజాపహర్తయు భుజార్గళము ల్వేసఁజాఁచి యంచితా
మోద వికాసవన్నయన ముగ్ధ సరోరుహ పంక్తిఁ బూజ ల
ర్యాదరలీలఁ జేయు నమరాధిపుఁ గౌఁగిటఁ జేర్చెనూతనా
భోదము సానుమచ్ఛిఖరము ప్రభనంబునఁ గప్పుకైవడిన్. (3-6)

దేవలోకంలో దేవకాంతలు నీలమేఘశ్యాముడైన గోవిందుణ్ణి కన్నులవిందుగా చూశారు.

ఉ. కాయభేదిఁజూచు తమకంబున మజ్జన మాడియాడి నీ
లాలక యోర్తు గంధ సలిలార్ద్ర కచంబులు చన్నుదోయిపై
వ్రాలిచి సందిటంబొదివి రాజ వథంబున కేఁగుదెంచె గో
పాలక మూర్తిఁగాన శిబిర్హ్మము కానుక దెచ్చెనో యనన్. (3-14)

ఉ. దనుజవిరోధి మీఁద నొక తన్వికరంబున లాజలెత్తి చ
ల్లిన నెటివేణి యీసున బలె న్వెరి పూవులఁజల్లెఁ, జల్లె లో
చనములు నమ్మదాశ్రువులఁ, జల్లె లలాటము ఘర్మబిందువుల్,
చనుఁగవ చల్లె సంభ్రమ వశ ప్రతి తామల మౌక్తి కాదులన్. (3-19)

శ్రీకృష్ణుడు సత్యభామకు నందనోద్యానంలోని వసంత శోభను వర్ణించి చెప్పాడు.

చ. తనుఁగనుఁబ్రామి యొండొక లతం బతి వేఱొక తేఁటి బోటి పొ
త్తున విరిదేనె గ్రోలఁగని తూలుచు సంపఁగి తావి వెల్లిలోఁ
గనలునఁ గూలఁబోవు నలికామిని సాహసమేమి సెప్పుఁ న
య్యనుఁగుఁ బ్రియుండు నెచ్చెలులు నాఁగిన మాన దరాళకుంతలాఁ (3-57)

సత్యాకృష్ణులు ఆకాశగంగలో జలకేళి సలిపారు.

చ. ఇనకర తాప వేదన సహింపఁగ లేక నిజోదకంబులన్
మునిఁగి వినీల కుంతల సమూహము నారఁగనిచ్చె నాఁగ వీ
చినికర చాలనం దరులఁజేరిన జొంపపు నాఁచుఁదీగ లం
దనరు నభోనదింగనియె దానవలోక విరోధి యత్తఱిన్. (4-28)

శ్రీకృష్ణుడు పారిజాతాన్ని పెకలించి నప్పుడు వనపాలకులు అడ్డగించారు. అప్పుడు సత్యభామ భర్తను వారించి వారికి తాను సమాధానం చెప్పింది.

ఉ. నా విని సత్యభామ వదనంబున లేనగ వంకురింప, నే
మే వచియింపఁ బూను హృదయేశ్వరునిం గనుసంజ్ఞ మాన్చి, చ
న్నైవల జాఱు కొంగు సవరించుచు, వీడినకొప్పుఁ బల్మఱుం
జే వెడదోఁపుచుం బలికెఁ జెందొవచూపులు క్రేళ్ల దాటఁగన్. (4-58)

సీ. వినుడు! సురేశ్వరు వనపాలకులు! వార్ధిఁ
బొడమిన యీ దివ్య భూరూహమున
కింద్రాణి యెవ్వతెఁ? యింద్రుడు నెవ్వడు?
తోడి యిందిరను గౌస్తుభము నెవ్వఁ
డధిపుడై ధరియించె నతఁడె చేకొనుఁగాక
తెకతేర యిది యేమి యొకరి సొమ్మే?
యిదె నాదు విభునిచే నీ వదాన్య నగంబు
నొడియించుకొని యేఁగుచున్న దానఁ

తే. బలుకు థాటికిఁ దా వీరపత్ని యేని
మీ శచీదేవి దనదు ప్రాణేశుఁడైన
మఘువు నిటఁబంపి సత్యభామా విధేయు
వలన మరలంగఁగొనుటెపో! వానితనము. (4-59)

ఇంద్రోపేంద్రుల యుద్ధం చూపరులకు విస్మయం కలిగించింది.

చ. అలఁగుల దట్టమై పొడము నగ్నికణంబుల సోఁకి పైగఱుల్
వాలిసియుఁదొంటి వేగ ముడివోక క్రమంబున నొండొకంటిఁ బిం
జలుకొని త్రోచికొంచు శరసంఘము లక్ష్యముఁదాఁకు విన్మితా
ఖిల సుర సిద్ధ సాధ్యముగఁ కృష్ణుడు జిష్ణుడుఁ బోరనయ్యెడన్. (5-25)

ఇంద్రుడు తన బాణాలన్నీ వృధాకాగా వజ్రాయుధం ప్రయోగించాడు.

మ. కని నెమ్మోమునఁ బిన్న నవ్వు దొలఁకం గంసారి నిశ్శంకఁ దా
ర్ష్యుని నడ్డంబుగఁద్రివ్వి వేగ రవితేజో దుస్సహ స్ఫూర్తియైఁ
దను డాయన్మత కోటిఁ గేల శతపత్రక్రీడఁ బట్టెం గటా
క్ష నిరీక్షాంచిత నందకత్సరు కిణాంకంబైన హస్తంబునన్. (5-36)

దేవేంద్రుడు శ్రీకృష్ణుని మహత్వం తెలుసుకున్నాడు. పారిజాతాన్ని సమర్పించాడు.

ఉ. సొమ్మున నెద్ది! యే ననఁగ సొమ్మున కెవ్వఁడఁ! గర్త వీవు, నీ
సొమ్మ ఖిల ప్రపంచమును, శూరకులంబు నలంకరించి నీ
వమ్మహినుండు నంతకు ననన్య దురాపము పారిజాత భూ
జమ్మును నుండు నన్న వికసన్ముఖుడై హరివీడు కొల్పుచున్. (5-40)

పారిజాతం పెరటి చెట్టుగా నాటించుకొన గలిగిన సత్యభామ భాగ్యాన్ని పొగడి, పుణ్యకవ్రతం చేయవలసిందని నారదుడు చెప్పాడు.

చ. అతులిత తావకీన మహిమాతిశయోచితమైన పుణ్యక
వ్రతమొనరింపఁగా వలయు వారిజలోచన! నీవు; న య్యరుం
ధతియును గౌరియు న్మచియుఁ దత్పరబుద్ధి నొనర్చువేళఁ జూ
చితి మును తద్విధం బెఱుఁగఁ జెప్పెద నేనిపు డానుపూర్విగన్. (5-55)

సత్యభామ పుణ్యక వ్రతాన్ని ఆచరించి ఉద్యాపనగా శ్రీకృష్ణుఁడు వస్తు వాహనాలతో, పారిజాతంతో నారదునికి దానమిచ్చింది.

ఉ. అనవిని సత్యభామ హృదయంబున లజ్జయు సమ్మదంబునుం
జెనఁ గొనఁ బ్రాణవల్లభునిఁ బ్రేమరసాలస వీక్షణంబునం
గనుఁగొనిఁ మోము వాంచి మధుకైటభమర్దనఁ చిత్తగించితే
మునిపతి మాట నావుడును మోవిపయిం జిఱునవ్వుగుర్వఁగన్. (5-77)

మ. నవచంద్రాలిక: నీకు నేల యనుమానం బాగమోక్తంబుగా
న విచారింపక ధారవోయుమనిన స్లజ్జాభరాక్రాంతలై
సవతుల్వాంచిరి వక్త్రపంకరుహము ల్సంబంధి భూపాలక
ప్రవరు ల్సల్పిరి నర్మ గర్భిత వచ: ప్రాగల్భ్యముల్ చెంగటన్. (5-78)

మ. మునిపతి యానతిం జకితముగ్ధమృగీ తరలాక్షి ప్రాణ నా
థుని గనకాంబరాంచలముతోఁ గునుమాయుధ వాగురానిభం
ధనమును బోని క్రొవ్వీరుల దంశఁ దగులొక్కనఁ జుట్టి వేడ్కఁగ
ల్పనగముఁ గూడఁ గంకణ ఝళం ఝళ మంజుల దోర్యుగంబునన్. (5-79)

వలిమల యల్లువాడు - హిమవంతుని ఆల్లుడు
ఉడివోని - తరుగని
పంట వలంతి తొయ్యలి - భూమియను వనిత
కౌషేయకము - కత్తి
రవరవలు - స్పర్ధలు
వలిగుబ్బలి ముద్దుపట్టి - హిమవంతుని గారాబు బిడ్డ
అళి నీలాలక - చుమ్మెదలవంటి కురులుగలది
సురటి - వీవన
హుతాశనకీల - అగ్నిజ్వాల
సూడిద - కానుక
మతకరివేలుపుంచపని - మాయావియైన సురముని
కోటరము - తొర్ర
నిరస్త - తోసివేయబడిన

గాసిలు - శ్రమునందు

కంకటి - మంచము

జంకెన - బెదరించు

హావళి - ఉపద్రవము

అర్మిలి - ప్రేమ

లతాంతాయుధుడు - మన్మధుడు

వితానము - గుంపు

కలకంఠ వధూ - ఆడకోయిలల యొక్క

కాకలీ - సూక్ష్మమైన

లలితేంద్ర నీల శకలోపమకైశిక - సొగసైన యింద్ర నీలమణి ఖండాలవంటి కేశభారము కలది.

అపగమ - పోకచేత

ఉన్మీలన - వికాసము

నైదాఘ సమయము - గ్రీష్మకాలము

శకుంతరవము - పక్షుల ధ్వని

కజ్జలనులు - కాటుకలు

ధూమ మాలికలు - పొగ చాలులు

బోన పుట్టిక - భోజన పదార్థాల గంప

సహస్ర మయూఖుడు - సూర్యుడు

నంతమనము వేరువిత్తు - చీకటిని నాశనము చేయువాడు

పుంశ్చలీ సమితి - జారిణీ సమూహము

చుక్కవాలు - ఎదుటి చుక్క

కోకములు - చక్రవాకములు

వలిపము - సన్నని తెల్లబట్ట

పటీరము - మంచి గంధము

భుజార్గళములు - గడియల వంటి బుజాలు

సానుమచ్ఛిఖరము - పర్వత శిఖరము

శిఖిబర్హము - నెమలి వింఛము

లాజలు - పేలాలు

కనుబ్రాము - వంచించు

గఱుల్ - రెక్కలు

జిష్ణుడు - ఇంద్రుడు

శతకోటి - వజ్రాయుధము

నవ చంద్రాలిక - విదియచంద్రునివంటి కొసలుగలది

GSMBOIC143

92



	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	9SMb01CC43
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	3-08-24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	29
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	Ci, ii, IV, 21
లేని పేజీలు	no
తయారు చేసినది	Triveni
పేజీలు విడదీసినది	Mahima
స్కాన్ చేసినది	Aswini
పరీక్ష చేసినది	SANGEETHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	no
పరిస్థితి	good